# హరికథలో పిట్టకథలు

వడ్లపట్ల దయానందం

కథానిక

విశ్వామిత్రులవారు శ్రీరామచంద్రమూర్తినీ, లక్ష్మణుణ్ణీ వెంటేసుకు బయల్దేరారు సీతామ్మవారి స్వయంవరానికి. మధ్య దారిలో రాములవారి పాదాల కడ్డు తగిలిన బండరాయి ... అమాంతం అహల్యయిపోయి భక్తిప్రపత్తులతో పాదాలకడ మోకరిల్లింది. అనుట్నావిణ్ణి దీవించేసి, చకచక నడకసాగించారు ముందుకి, ఆలస్యాన్ని పూడ్చుకునేందుకు. స్వయంవరాని కాజరైన తండులో రాములవారికి చెప్పుకోదగ్గ అపోనెంటు ఒక్క రావణుడే...మిగిలిన వారంతా అసలా వింటిని కదల్చనేలేక పోయారు. ఒక్క రావణుడే బ్రహ్మాండమైన అట్టహాసం చేసి...ఎట్టకేలకా వింటిని నెత్తగలిగి...తుట్టతుదకు విరచలేక బోర్లాపడ్డాడు (ఖర్మంకాలి రావణుడే విరిచేసుంటే... రామ...రామ...రామాయణమే తల్లక్రిందులై రావణాయణం ఐ ఉండేది.)

అప్పుడు మన రామయ్య పులిలా లేచి... మృగరాజులా నడచి...వింటిని చులాగ్గా ఎత్తేసి...ములగకొమ్మను విరిచినట్లు పెళపెళ విరిచి పారేశాడు. ఆ క్షణంలోనే పెద్ద దండని చేబూని...యిరువురి చెలికత్తియల నడుమనున్న సీతమ్మవారి మనసును సడన్‌గా దోచేసుకున్నారు రాములవారు.

ఈ సన్నివేశంలో దాసుగారాగారు — కాఫీ నీళ్ళతో నోరు తడిచేసుకునేందుకు.

ఇదే సమయంలో మగవాళ్ళల్లో కూర్చున్న ఓ 'జులపాల రాయుడు' ఆడవాళ్ళల్లో కూర్చున్న మరో సీతమ్మ మనసును, అకస్మాత్‌గా దోచుకున్నాడు. ఐతే ఈ 'జులపాలరాయుడి' మనసును ఆ 'అమ్మి' పదిరోజులక్రిందటే దారుణంగా దోచేసుకుంది. అందుకే "హరికథలేమిటే?...అందులోనూ రామాయణమా? పాత చింతకాయ పచ్చడీలా!" అని మొదట్లో చప్పరించేసిన ఆ జులపాలరాయుడే పదిరోజుల్నుంచి శ్రద్ధగా చిల్లరకానీతో సహా హాజరవుతూంట. ఈ మర్మాన్నెరిగిన ఆ పడుచు కూడా "వేచి చూద్దాంలే...పోయిందేముంది" అన్న ఉద్దేశ్యంతో పాపం రోజూ హాజరవుతూనే ఉంది. హరికథదోవన హరికథ జరిగిపోతూంటే, కొత్తగా ఈ పిట్టకథొకటి ప్రారంభమయిందన్నది 'మద్దెలప్పన్న' తప్ప మరో పురుగు కనిపెట్టలేకపోయింది.

ఆ రోజు కథయ్యాక జులపాలరాయుణ్ణి చాటుకి పిలిచి దబాయించేడు మద్దెలప్పన్న—

"ఏం వెంకన్నా...ఆ చిన్నదానితో కథ ఎంతవరకూ నడిచింది" అని హుందాగా నవ్వేసి—ఆ తర్వాత మీసం శీవిగా దువ్వుకుంటూ "వాళ్ళ బాబాయ్ ఎవరో తెలుసా...అగ్గిరాముడు... మనకి బాగా తెలుసులే... పేరు చెబితే కాకులు కూడా నీళ్ళు ముట్టవ్ ఏమనుకుంటున్నావో"— అన్నాడు బెదిరింపుగా చూస్తూ.

వెంకన్నసైతం చిన్నవాడైనా కాస్త ఢక్కామక్కీలు తిన్నరకమే. ఒక ఊపు ఊపి చూచాడు. "హుఁ...కుర్రకారులో వీడిగ్రేడు కూడా అదే. వీడిపేరు చెబితే...ఆ అగ్గిరాముడు సైతం గడగడలాడాల్సిందే."

అకస్మాత్‌గా తెల్లపోయాడప్పన్న. అంతలోనే తెప్పరిల్లి వెంకన్న బుజం హుషారుగా చరుస్తూ "శభాష్ రాకుమారా జయించావ్ ఫో...రెండాకు లెక్కువే చదివావ్...ఆ రాకుమారికి బాబాయీ లేడు అగ్గిరాముడూ లేడు... పెద్దతల్లి ప్రాపకంలో అల్లారుముద్దుగా పెరుగుతోంది. ఈ మధ్య కొత్త గూటికై అన్వేషణలుకూడా ప్రారంభమయినట్టు వినికిడి...అవును కాని నాయుడూ! కథెంతవరకూ వచ్చిందీ ... దాపరికం లేకుండా చెప్పేయ్" అన్నాడు.

అంతవరకూ ఆశ్చర్యంలో నిండా మునిగిపోయిన వెంకన్న క్రమంగా తేలి "హరిఅప్పన్నా ఇట్టే దొరికిపోయావే! అదా ఆ చిన్నదాని అసలుకథ. రైటో" అని పరిగెత్తు కెళ్ళిపోయి చార్‌మినార్ పెట్టితో ఊరికెత్తుకొచ్చేసి అప్పన్నకిచ్చేసి..."కాల్చేయ్ అప్పన్నా" అన్నాడు ఆప్యాయంగా.

"నాయుడూ నువ్వు కుర్రోడివైనా నీ బుద్ధి పెద్దదోయ్. అవునుగాని అసలు విషయం చెప్పావు కావు." అంటూ అంటుకున్నాడా సిగరెట్టు పెట్టె.

"అబ్బే! పెద్దగా విశేషమేముందీ ఇందులో. వారం రోజుల్నుంచి వాలు చూపులు విరివిగా విసురుతోంది. మనం ఉచితరీతిని స్వీకరిస్తూనే ఉన్నాం. అయితే వాటివెనక ఉన్న భావం ఏమిటో నిన్నటివరకూ నిఖరంగా తెలిసేడ్చింది కాదు. ఈ వేళే కాస్త బయటపడ్డది. దాదాపూ బండి దారిలో పడ్డట్టే—"

ఆ మర్నాటినుంచీ మద్దెలప్పన్న వరస దారి తప్పింది. దాసుగారడుగు ఉత్తరానికైతే, అప్పన్న వరస దక్షిణానికి దారితీస్తోంది. వెంకన్నా సీతమ్మల చూపులాటని తిలకించడంలోనే పూర్తిగానిమగ్నుడై పోయాడప్పన్న. అప్పన్న వ్యవహారాన్ని పరికించి చూచిన "యువ హరిదాసు" వ్యవహారాన్ని కాస్తగా పసిగట్టి ఆ రోజు కథయ్యాక అప్పన్నని నెమ్మదిగా కదలేశాడు...

"ఏవిటప్పన్నా అసలు విషయం?" అని.

"అబ్బే మరేంలేదండి. కథలో కథ ఇదొక పిట్టకథ. అంతేనండి. మీ కథ పూర్తయ్యేలోపల ఇది కూడా పూర్తయ్యే పక్షంలో...ఆ స్తంభం దరిన కూర్చుంటాడే, ఎర్రగా కోలముఖం పెద్ద జుట్టు అతన్నుంచి మనకో రెండు సువర్ణాంగుళీకాలు కథాంతంలో కానుకగా వస్తాయ్. అంతే నండి." అన్నాడు చేతులు నలుపుకుంటూ.

అన్యప్రాంతీయుడైన హరిదాసు ప్రాంతీయుడైన అప్పన్నమాటకి కొంత తడవుంకించి తల పంకించి అటుపై ఇటులన్నాడు:

"అయితే ఈ ప్రాంతంకూడా సుప్రసిద్ధమే నన్నమాట" అని.

"అవునండి తమరొచ్చి పది రోజులేనా మరి అయ్యింది. ఇంకెలానూ నెల రోజులుండాలాయె. సంపూర్ణరామాయణ హరికథా కాలక్షేపానికి ... వెనకటికొచ్చినఓ దాసుగారుకూడా ప్రవేటుకాపురం పెట్టి మూడు సంవత్సరాలుండి మరీ వెళ్ళారండి. ముందు ముందు మీకే బోధపడుతుందిగా."

ఈ దెబ్బతో ఇంకా భర్త్రాశ్రమాన్ని స్వీకరించని హరిదాసు ఒడలు విపరీతంగా పులకరించాయ్. ఏమిటో ఆ రోజునుంచి నూరు చందమామల కాంతితో ప్రజ్వరిల్లుతూ అత్యంతుత్సాహంతో అడుగేస్తూ వినేవాళ్ళు చూచేవాళ్ళు ఆశ్చర్యంతో "ఔరా...ఎంతటి ఘటికేమేలు ఈ దాసుగారు"— అనుకునేటంతగా ఉత్తమస్థాయిలో కథ నడప ఆరంభించాడు. జులపాలరాయుడు స్తంభాస్థలిని విడిచి దాసుగారెదుట సరిక్రొత్త పీఠాన్నేరచుకున్నాడు. జులపాలరాయుడి నుద్దేశించే చెబుతున్నట్లు ధోరణి నడపసాగాడు దాసు. జులపాలరాయుడు కూడా అత్యంతాసక్తితో కథ వింటున్నట్టు మధ్యమధ్య—రసజ్ఞుడిలా బుర్రూపుతూ సీతమ్మ సమక్షంలో... కోటి చందమామల కాంతిలో విపరీతంగా వెలుగొంది పోతున్నాడు.

ఒకనాడు పనికట్టుకుని ఆడవాళ్ళంతా ఆశ్చర్య పోయారు. "ఏవిటీ ఈ అల్లరి వెధవ ఇంత కుదురుగా కూర్చుంటున్నాడు...దాసుగారి ప్రాపకం పిడికెలా లభించింది-" అని.

ముక్కుమీద వేళ్ళేసుకున్న వాళ్లు నోళ్లు తెరచిన వాళ్ళూ కనుబొమ్మ లెగరవేసినవాళ్ళుఅసలుమర్మం తెలియక అలా ఆశ్చర్యంతోనే ఉండిపోయారు.

సీతమ్మ మాత్రం ఉబ్బిపోయింది, తన హృదయ రాజు సిసలైన రాజులాగే వెలుగొందుతున్నందుకు. ఆ మర్నాడిహ ఉత్తరరామాయణం ప్రారంభమౌ తుందనగా, ఆరోజు అర్థరాత్రి మద్దిలప్పన్న చుట్ట ముట్టించి చెంబుతీసుకు బయలుదేరాడు పందు వెన్నెట్లో రెండు నిండు విగ్రహాలు గుడికాడ బావి కాడ గుసగుసలాడుతున్నట్టు పసిగట్టి ... ఏమీ ఎరగనట్టు చక్కావచ్చి గోడచాటున నిలబడ్డాడు, సంభాషణ నాలిద్దామన్న తలంపుతో.

"సీతా, ఇవన్నీ నెలరోజులక్రితం నేకన్న కలలే. అబ్బా! నా మాట నమ్ము, ఇప్పటికీ ఇది నిజం అని పూర్తిగా విశ్వసించలేకపోతున్నాను. ఆహా...నా యీ ఎడారిలాంటి వెధవజీవితం, నిన్ను చేబట్టబో తూండడంవల్ల సశ్యశ్యామలమైన మాగాణిలాంటి దయింది. పున్నమినాటి తేనెతుట్టులాంటిదైంది. ఇంకా...ఇంకా...ఏవిటో సీతా సంతోషంలో అసలు మాటలే రాకుండా ఉన్నాయ్."

"హరి వెంకన్నా, నువ్వా!" మనసులోనే అను కు ఆశ్చర్యపోయాడప్పన్న.

"ఇది సినీమా కాదుగా! కనీసం కథైనా కాదాయె. అందుకని మాటలకోసం బాధపడకు

వెంకన్నా. చూడు, నా హృదయం కూడా నెల రోజులమాట అలా అట్టేపెట్టి, వారంరోజుల్నించి మరీ తహతహలాడిపోతోందంటే నమ్ము. విపరీతమైన దాహంతో కూజాలో చల్లటి నీళ్లు తాగినట్లయింది, మన ఈ సంభాషణా భాగ్యం లభించినందుకు."

"చాలు సీతా. ఇక తక్షణం ఆపేయ్. ఇలాంటి మాటలు ఇంకా మాట్లాడావంటే సంతోషంతో మరీ ఉక్కిరిబిక్కిరై పోతాను. ఇక అలా చూడు, ప్రేయసీ!...అహా...నా హృదయ రాణీ! అబ్బ ఈ రెంటిలో ఏదీకూడా నే ననుకున్నంత పవర్ ఫుల్ గా లేదు. ఊరంతా బండనిద్దరోతోంది. మన ఈ ఏకాంత సంభాషణల్ని ఏ ఒక్క వెధవా ఆలకించలేదు. పున్నమినాటి చంద్రుడు చూడు మన కోసం మరింత వెలుగుల్ని విరజిమ్ముతున్నాడు. ఆ వెలుగులకి రంగురంగుల తారకల్లా మెరుస్తున్న నీ చెవుల దుద్దుల్లోని రవ్వలు, నున్నటి నీ చెక్కిళ్ళకి రమ్యమైన కాంతులను పూస్తున్నాయ్. నీచెక్కిలిపై ప్రతిబింబిస్తున్న నా వదనబింబం కూడా వింత కాంతులను కూర్చుకొంటోంది. అసలుచంద్రబింబం లాంటి నీ ముఖాన్ని చంద్రుడిలోని ఆ మచ్చల్ని మినహాయించే పోల్చాలి..."

"ఇకాపేయ్ వెంకన్నా. ఈ ధోరణంటూ సాగితే, అక తెల్లారిపోతుందేమో! ఇక నే వస్తా మరి..."

"ఆ...సీతా...ఈ వెన్నెలనంతట్నీ చీకటిచేసి పారేసి పోతానంటావా? నువ్వు 'ఊఁ'అంటేచాలు పీలుచూసుకుని తక్షణం వెళ్ళాడేయడానికే సిద్ధం. అను సీతా, అను...'ఊఁ' అను."

"అబ్బ! ఉండు, చేతులొదిలిపెట్టు..."

"అవి చేతులు కాదు. కాళ్ళనుకోమంటున్నానుగా."

"ఛఛ...తప్పుగాదూ! అలాగేలే 'ఊఁ' అంటున్నానుగా."

"శీఘ్రమేవ కళ్యాణ సిద్ధిరస్తూ!" ఈ కొత్త స్వరం హఠాత్తుగా వినిపించి, ప్రేమపక్షులు రెండూ కంగారుగా ఎగిరిపోబోయాయ్.

"బెదిరి ఎగిరిపోబోకండి నేనే అప్పన్న" నన్నాడప్పన్న.

పాపం, సీత సిగ్గుతో తలొంచుకోబోతూంటే—

"ఎందుకులే అమ్మాయ్ ఆ సిగ్గంతా? మొదట్నించీ నాకు తెలిసిందేగా!" అని సముదాయించాడప్పన్న.

ఆ మర్నాడుత్తర రామాయణం ప్రారంభమైంది. ముందు ముందు, సీతారాములు, విడివడి ఒంటరొంటరిగా ఇద్దరూ పడే విరహవేదన ఆనాడే అంతర్గతంగా స్పృజించి మరోవితంతువుహృదయం, అనుకోకుండా వలపులు చిగురించింది. ఆ వలపు చిగురులకు హరిదాసు ఆనాటికి తన హృదయంలో కాస్త చోటిచ్చాడు. మరో పదిరోజుల కల్లా కాస్తయినా మిగుల్చుకోకుండా పూర్తిగా ఇచ్చిపారేశాడు. ఆ దెబ్బతో దాసుగారి హృదయము భారమై...కథాగమనం మందగించింది.

దాసుగారి హృదయంలో గప్-చిప్ గా దొంగిలింప ఏమీ ఎరగనట్టు నటిస్తున్న ఆమరో 'మంగమ్మ' మర్నాటినుంచీ, రెండు సరివత్సరాల క్రితం విడిచిపెట్టిన బొట్టును తిరిగి నొసటకి తెచ్చుకుంది. (అందులోనూ కళ్యాణం బొట్టు) లేబెట్టుమోడలివి గాజులు రెండుచేతులకీ నిండుగా తగిలించుకుంది. ముడినల్లా వాలుజడగా రూపొందించి, సిగని పూలతో సింగారించింది. ముచ్చటైన మామిడి పిందెల నెక్లెస్ కంఠానికి కూర్చుకుంది. తెల్లచీర వదలి, పువ్వుల సిల్కుచీరని ధరించింది. మనసారా ఆదివ్యమంగళ విగ్రహాన్ని గాంచిన దాసు కథ చెబుతూనే మనసులో అనుకున్నాడు:

"ఆహా 'మంగ' నిజంగా కిలమొదిలిన రాగి పాత్రలా ఉంది" అని.

ప్రస్తుత స్థితినిబట్టి చూస్తే కాస్తో కూస్తో స్థితిపరురాలేనన్న అనుమానం గాఢమై వెంటనే ప్రేమ మరికాస్త బలీయమైపోయింది. అట్టే ఆలశ్యం చెయ్యకుండా అప్పన్నని దూతగా చేసుకుని రాయబారం సాగించాడు దాసు తెగించి.

"మంగ"లో కలిగిన ఈ మార్పుకు ఆలయం అంతా ఆశ్చర్యపోయిందిసారి.

"ఏవిటీ మంగ వేషంలో మార్పు" అనుకున్నారు మగవాళ్ళంతా.

"అవును ఏవిటీ దీని పోకడలు అర్థంకావడం లేదే" అనుకున్నా రాడవాళ్ళంతా.

కారణం కాని...మూలం కాని...అంతుచిక్కని కారణాన ఆడామగా అంతా అలా ఆశ్చర్యంతోనే

ఉండిపోయారు. ఈ పరిణామం దారితీయగల పర్యవసానంపై మూలం ఆధారపడి ఉంటుందని ఎవరికివారే ఊహించుకున్నందువల్ల ఫలితంకోసం ఆత్రంతో ఎదురు చూడసాగారు.

మంగ నాయికగా నిర్ధారణైనప్పటికీ నాయకుడెవరో నిఖరంగా తేలని పరిస్థితిలో "ఏంవోలే. ఊరికే ఒకర్ని గురించి ఆడిపోసుకోవడం దేని"కని కొందరు బుద్ధిమంతులు తటస్థులుగానే ఉండిపోయారు.

ఒకనాటి రాత్రి రాయబారానికై వెళ్ళినప్పన్న తిరుగు సమాచారంతో ఉత్సాహంగావచ్చి "దాసుగారూ తమ రదృష్టవంతులు పొండ"న్నాడు.

సమాచారం సవివరంగా నివేదించమన్న దాసుగారి అభ్యర్థనని పురస్కరించుకొని "చెబుతున్నాగదండీ... అసలీ వూళ్ళో కాలుపెడుతూనే మీరు నక్కని తొక్కొచ్చారనే... నా అన్నవాళ్ళెవరూ లేని పరిస్థితిలో యాభైవేల రూపాయలు కిమ్మత్తు చేయగల స్థిరాస్తికి ఏకైక అధికారిణి మనసారా మనసు నీయగలవానికై భర్తపోయిన మర్నాటి నుండీ ఎదురుచూస్తోందా ప్రౌఢ. అట్టివాడు లభించిన తక్షణం మళ్ళీ మాట్లాడక పెండ్లాడేసి ఆ ఆస్తిభారాన్ని ఆ అదృష్టవంతుడి బుజాలమీద పారేసి ఆ భాగ్యశాలి హృదయంలో, శాశ్వతంగా తిష్టవేసుకు కాలం వెళ్ళబుచ్చాలన్నది ఆప్రౌఢ నాయిక స్థిరసంకల్పం. అయితే ఈకథా గమనం ఇంత సాఫీగా నడిచిపోవడానికి వీల్లేని స్వల్ప అడ్డంకులు కూడా లేకపోలేదు.

"నాయిక వేలు విడిచిన-మేనమామ కొడుకైన మరో ముదురు బ్రహ్మచారి ఆస్తికివలచి నాయిక హృదయాన్ని దొంగిలించడానికి గతంలో తీవ్ర ప్రయత్నాలుసల్పి నిష్ఫలుడైయున్నాడు. నాయిక ససేమిరా వీల్లేదని హృదయాన్ని తగిన బందోబస్తుతో కట్టుదిట్టం చేసుకుంది. ఇది గ్రహించిన ఆ విలన్ నీచబుద్ధియై బలప్రయోగంతో దురాక్రమణ జరుప పెద్దయెత్తున సన్నాహాలు జరుపుతున్నాడు. (కోటద్వారాన్ని—అదే హృదయ కవాటాల్ని—బ్రద్దలుగొట్టి, హృదయ రాజ్యంలో ప్రవేశించి సింహాసనాన్నధిష్ఠించడానికి.) అబల ఐన నాయికి మానవ హృదయాల్ని సైతం అలా బలవంతంగా దొంగిలించాలని యత్నించే నీచుణ్ణి, తన హృదయరాజ్యానికి పట్టాభిషిక్తుణ్ణి చేయడానికి ఎట్టి పరిస్థితిలోనూ సుముఖురాలిగా లేదు. సదరు రాజ్య కిరీటాన్ని, మీకు తగిలించడానికి హృదయపూర్వకంగా అంగీకరించినట్లు, వారి వర్తమానంగా తమకి తెలియజేయమన్నారు. మరొక పరాకూడా లేకపోలేదు. ఆ విలన్ వెధవ బహుక్రూరుడట, వాడి చేతిలో రౌడీగాంగ్ దండిగా ఉందట. అట్టిదెరి, మొట్టమొదటి ఉద్రిక్త పరిస్థితిలో, ఎట్టి అఘాయిత్యానికైనా, ఆ ఆకతాయి వెధవ పాల్పడవచ్చునని నాయిక అనుమానిస్తోంది. అందుకుగాను ఉద్రిక్తత తగ్గి పరిస్థితులు కుదటపడేవరకూ, కొన్నిమాసాల పాటు నాయకునితో సహా నాయిక అజ్ఞాతవాసాన్ని అభిలషిస్తోంది. దానికి తక్షణం మూటాముల్లె సర్దుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది కనుక, హరికథా కాలక్షేపాన్ని ఇంతవరకూ ఐన లవకుశుల జననంతోనే ఆపేయడం ఉత్తమం. నాయికి నిజమర్మం ఎరిగినవాడైన ఆ కుటిల విలన్, మీపై పగబూని, మీ పీక నులిమేస్తానని బెదిరిస్తూ నాయికకి లేఖలు గుప్పిస్తున్నాట్ట. మొన్న రాత్రి బలవంతాన అంతఃపురంలో ప్రవేశించి—

"ఏమే, ఐనవాడిని నేనుండగా మరో వెధవ చుట్టమయ్యాడా నీకు? హరికథలు చెప్పుకు బతికే ఆ వెధవ దాసుకి మనసిచ్చేస్తావా?... మర్యాదగా ఉపసంహరించుకో. లేకపోతే వాణ్ణి కాస్తా 'హరీ' అనిపించేస్తా. వ్యవహారం ఏమిటో ఖచ్చితంగా తేల్చేయ్ ఇప్పుడు." అంటూ పీకలమీద కూర్చున్నాట్ట. పాపం, నాయిక ఇటువంటి విపరీత విపత్కర పరిస్థితుల్లోపడి ఉంది. అరరె, మీరేడుస్తారేమిటి?" ఆశ్చర్యంతో ఆగాడప్పన్న; దాసుగారి కన్నీళ్ళు చూచి.

"పాపం ఆ కుసుమకోమలి హృదయం ఎంతగా తల్లడిల్లిపోతోందోగదా... అబ్బా- నిజంగా ఎంతటి గంభీర హృదయం... ఇంతటి తీవ్రమైన తుఫాను హృదయంలో చెలరేగి ఉండగా... రవ్వంతైనా పైకి కనబర్చక... మీదుమిక్కిలి... పూర్ణచంద్రుని వంటి నిండువదనంతో అమృతమయములైన చిరునవ్వులు సదా చిలకరిస్తూ ఉండేది..." మళ్ళా కన్నీరు.

"ఏడ్వకండీ మనమేం చేస్తాం...అవున్లెండి మరి.. మనసులిచ్చేసుకోవడం ... పుచ్చుకోవడం అంటూ జరిగిపోయిన దరిమిలాను... ఇద్దర్లో ఏ ఒక్కరికాపదలొచ్చినా...ఇద్దరికీ వచ్చినట్టే భావించి కలిసేడుస్తారు. పాపం ఆవిడకూడా ఆ వెధవనుంచి మీకే ఆపద మూడుతుందోనని నా సమక్షంలోనే పావుగంటసేపు నిర్విరామంగా ఏడ్చింది. దానిమీదే 'ఏడ్వకండి ఏం చేస్తాం ... అంతా విధివిలాసమే గదా...మనం నిమిత్తమాత్రులమేనాయె'...అని మెయిల్‌కి సిద్ధం కమ్మన్నానండి" ఆగాడప్పన్న.

"రైటో- మంచిపని చేశావ్ నీ ఋణంతీర్చుకో లేనప్పన్నా" అన్నాడు దాసుగారు చేతులు పట్టుకుంటూ.

"అయ్యో ఎంతమాట ... ఏదో తమదయ!" చేతులు నలిపాడప్పన్న.

"అజ్ఞాతవాసానంతరం నీకు తగిన 'ఈనామే' ఇస్తా" లెమ్మని వాగ్దానం చేశాడు దాసుగారు.

సంపూర్ణ రామాయణం-లవకుశుల జననంతోనే ఆగిపోయింది. సీతా, వెంకన్నల వివాహం వైభవోపేతంగా జరిగిపోయింది.

మంగవేషంలోని మార్పుకు కారణం తెలిసిపోయాక కాసేపాడిపోసుకుని ఆశ్చర్యంనుంచి కోలుకున్నారు జనం అంతా. "రామాయణంలో—పేరిమాయణం" అని గుడి గోడమీద కొంటె పిల్లలు చెక్కిన అక్షరాలు మట్టుకు యింకా అలాగే ఉన్నాయి.

---

కథానిక

# గెలుపు ఎవరిది?

వై. రాధాకృష్ణమూర్తి

ఆఫీసుకు వెళ్ళటానికి తయారై "పార్వతీ!" అని యింట్లోకి కేకవేశాడు విశ్వనాథం; సమాధానం వంట యింట్లో గిన్నెలు, చెంబులు చెప్పాయి గాని పార్వతి మాత్రం పలకలేదు, బయటికిరాలేదు.

తిన్నగా విశ్వనాథమే వంటయింటిదాకా వెళ్ళి "నేను ఆఫీసుకు వెళ్తున్నా. సాయంత్రం వచ్చేటప్పుడు యేమైనా తీసుకురావాలా?" అన్నాడు.

"వెళ్ళండి. ఇంటికి నేను కాపలా కాస్తూవుంటా. వచ్చేటప్పుడు రెండు గజాలు గట్టితాడు తీసుకురండి" వెధవ గిన్నెలు మళ్ళా గొడవచేశాయి.

"తాడెందుకు?" ఏమీ బోధపడక అడిగాడు విశ్వనాథం.

"మీ పీడా నా పీడా విరగడ చేసుకోవటానికి"

ఇక వాదన లాభం లేదని తిన్నగా బయటికొచ్చాడు విశ్వనాథం ఆఫీసుకు వెళ్తూ, ఆఫీసులోనూ, యిదే ఆలోచనైపోయింది. ఒకటే ప్రశ్నకు అతనికి సమాధానం దొరకటంలేదు.

"పార్వతికి కోపం రావటానికి కారణం యేమిటి?"

నిన్న రాత్రివరకూ బాగానేవున్న పార్వతి తెల్లవారేసరికి హఠాత్తుగా మారిపోయింది. తను నిద్రలేవటమే గాజు గ్లాసులు నేలమీద చేసిన చప్పుడుతో లేచాడు. అప్పటినుంచీ గమనిస్తున్నాడు. పార్వతి పూర్తిగా మారిపోయింది. ఒకటే రుసరుస.

"ఏమిటి పార్వతీ యీ గొడవంతా? అసలు కారణమేమిటి?" అనడిగాడు.

"అవును గొడవకాదూ మరి? నేను మీ జీవితానికే పెద్ద గొడవనై కూర్చున్నాను. అసలు కారణమేమిటంటే నేనింకా బతికి వుండటమే."

ఎంతసేపూ సంభాషణ యిదే పద్ధతిలో నడిచింది తప్ప ఆ రోజు వుదయంనుండీ యింట్లో క్షణం సేపు స్తిమితంగాలేదు. కారణం విశ్వనాథానికి తెలియదు. పార్వతి చెప్పదు.

తమ రెండేళ్ళ కాపరాన్నీ ఒక్కసారి సింహావలోకనం చేసుకున్నాడు విశ్వనాథం. ఇంతకుముందు కనీసం ఒక్కసారైనా తనకూ పార్వతికీ మధ్య పేచీరాలేదు. ఇప్పుడైనా పేచీ రావటానికి తనకేమీ కారణం కన్పించటంలేదు.

అయినా అంత పెద్ద కారణం లేనిదే పార్వతికి మాత్రం కోపమెందుకొస్తుంది? ఇంత మొండిగా ఎప్పుడూ లేదే! ఎంతసేపూ ఏదో తనమీదకసివున్నట్లు ప్రవర్తించటమే తప్ప కారణం తెలియనివ్వదు.